

కొలాంగూడకు చెందిన చేతిపంపు వద్ద నీళ్లు పడుతున్న తోయగూడ ఆదివాసీ గిరిజన మహిళలు

**కాంగ్రెస్ తెచ్చిన కరువు**

**● బోర్ మంటున్నాయ్..**



తోయగూడ గ్రామంలో అడుగంటిన చేతిపంపు





నీరుపయోగంగా మారిన నీటిట్యాంక్



అడుగంటి పోయిన వ్యవసాయ బావి

# పానీ పాట్లు

● ఏజెన్సీలో ఆదివాసుల దాహం కేక ● బిందెడు నీటి కోసం కిలోమీటర్ల పయనం

*ఇంద్రవెల్లి మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధిలో గల తోయగూడ గ్రామానికి చెందిన ఆదివాసులు బిందెడు నీటి కోసం కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తున్నారు. తోయగూడలో 30 ఉమ్మడి కుటుంబాలు ఉండగా 300లకు పైబడి జనాభా ఉంటారు. గతంలో తాగునీటి కోసం అధికారులు కొలాంగూడకు చెందిన ఓ వ్యవసాయ భూమిలో బోరు వేసి అక్కడి నుంచి పైపులైన్ సాయంతో నీటిని అందించారు. చేతిపంపులతోపాటు బోరుబావులు అడుగంటి పోయాయి. మిషన్ భగీరథ పథకం సరిగా పని చేయకపోవడంతో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. ఉదయం, సాయంత్రం చుట్టూ పక్కల గ్రామాల నుంచి నీటిని తీసుకొస్తున్నారు. బిందెడు నీటి కోసం కొన్ని కిలోమీటర్ల మేర వెళ్తున్నారు. నీటి ఎద్దడితో పెళ్లి వేడుకలు నిర్వహించాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు.*

*- ఇంద్రవెల్లి, మార్చి 30*



కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తీసుకెళ్తున్న ఆదివాసీ గిరిజన మహిళలు

### మిషన్ భగీరథ ద్వారా అందించాలి



తాగునీటి సమస్యను అధికారులు పరిష్కరించాలి. చుట్టూ పక్కల గ్రామాల్లోని చేతిపంపుల నుంచి బిందెడు నీళ్లు తెచ్చుకుంటున్నాం. గ్రామానికి చెందిన మిషన్ భగీరథ పథకం సరిగా పని చేయడం లేదు. గ్రామంలో నీటి సమస్యలు ఉండడంతో పెళ్లి వేడుకలు నిర్వహించేందుకు చాలా భయమేస్తున్నది. ఇంటికి బంధువులతోపాటు చుట్టాలు, ఎవరైనా వస్తే వారికి నీళ్లు ఇవ్వలేని దుస్థితి ఉంది. అధికారులు నీటి అవస్థను తీర్చాలి.


**- కనక లింగు, తోయగూడ.**



కొలాంగూడ వద్ద అడుగంటిన బోర్‌వెల్‌ను చూపుతున్న ఆదివాసీ గిరిజనులు

## పెళ్లి వేడుకల్లో ఖర్చులు తగ్గించుకోవాలి

బోథ్, మార్చి 30 : ఆదివాసీ సంప్రదాయం ప్రకారం చేసే పెళ్లి వేడుకలకు ఖర్చులు తగ్గించుకోవాలని పార్డి(బీ) గ్రామస్తులు తీర్మానం చేశారు. ఆదివారం సొనాల మండలంలోని పార్డి(బీ) గ్రామంలో ఆదివాసీ గిరిజనులంతా సమావేశమయ్యారు. పెళ్లి కానుకల గురించి చర్చించారు. పెళ్లి కొడుకు, పెళ్లి కూతురు కుటుంబీకులకు అహెరాలు(బట్టలు పెట్టడం) చేయరాదని నిర్ణయించారు. వాటికి బదులుగా తోచినంత ఆర్థిక సహాయం చేయాలని తీర్మానించారు. రక్త సంబంధీకులు మినహా మిగతా వారు అహెరాలు చేయొద్దని ఒప్పందం కుదుర్చారు. వీటితోపాటు ఎర్ర బొట్టుకు వెళ్లే సమయంలో ఖర్చు తగ్గించుకోవడంలో భాగంగా రెండు వాహనాలు మాత్రమే తీసుకెళ్లాలని, అంతకు మించి వాడితే రూ.5 వేలు జరిమానా విధించాలని తీర్మానించారు.



పార్డి(బీ)లో సమావేశమైన ఆదివాసీ గిరిజనులు

## మన్‌కీ బాత్‌లో ఇప్పలడ్డుకి చోటు

ఉట్నూర్, మార్చి 30 : దేశ ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ ద్వారా దేశంలోని ప్రముఖ విశేషాలు ప్రస్తావిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆదివాసుల ఆహారం ఇప్ప పువ్వు లడ్డును ప్రస్తావించారు. ఇప్ప పువ్వు లడ్డు ప్రాముఖ్యతను తెలుపుతూ ఆదివాసుల ఆహారం పేరిట మహిళలు చేస్తున్న పౌష్టికాహారం అని పేర్కొన్నారు. అలాగే అడవుల్లో పెరిగే ఇప్పపువ్వు సేకరించి దాని ద్వారా లడ్డును తయారు చేసి ప్రస్తుతం ఆశ్రమ పాఠశాలలో పౌష్టికాహారం కింద అందజేస్తున్నారు. దీనికి అప్పటి కేసీఆర్ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహం అందించి మహిళలు ప్రత్యేక కేంద్రం పెట్టుకునేలా ప్రోత్సాహం అందించడంతోపాటు ఉపాధికి బాటలు వేశారు. ఇక మన్‌కీ బాత్‌లో ఆదివాసీ ఆహారాన్ని ప్రపంచానికి తెలిసేలా చేసిన ప్రధాని నరేంద్రమోదికి గిరిజన నాయకులు విఠల్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.



ఈద్గా మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

## నేడే ఈద్ ఉల్ ఫితర్

### ముగిసిన ఉపవాస దీక్షలు

ఎదులాపురం, మార్చి 30 : ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాస ఉపవాస దీక్షలు నెలవంక కనిపించడంతో ఈనెల 2వ తేదీ తెల్లవారు జామున సహేర్‌తో ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి నెలవంక దర్శనంతో ఉపవాస దీక్షలు ముగియగా.. సోమవారం ఈద్ ఉల్ ఫితర్ జరుపుకుంటారు. కాగా రంజాన్ ప్రార్థనలకు పట్టణంలోని ఈద్గా మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. ఉదయం 7.30 గంటలకు ఈద్ నమాజ్ ఉండడంతో మైక్ సెట్లు, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నారు. కాగా.. ఎస్పీ అఖిల్ మహాజన్ ఈద్గా మైదానాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన వెంట డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, సీఐలు సునీల్ కుమార్, కరుణకర్‌రావ్, ఆర్‌ఎ మహేందర్ ఉన్నారు.

## కాంగ్రెస్, బీజేపీ నాయకులు హోర్డింగ్‌లకే పరిమితం

● మాజీ మంత్రి జోగు రామన్న

● బీఆర్‌ఎస్ పార్టీలో భారీగా చేరికలు

ఎదులాపురం, మార్చి 30 : బీజేపీ, కాంగ్రెస్ నాయకులు హోర్డింగ్‌లకే పరిమితం కాకుండా ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న హితువు పలికారు. ఆదివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రణదీవ్యనగర్, ఇంద్రానగర్, ఖుర్షిద్‌నగర్, హమాలీవాడలకు చెందిన దాదాపు 200 మంది బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన యువకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. మాజీ మంత్రి జోగు రామన్న వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమానికి పనిచేయాల్సిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ప్రజలపై బెదిరింపులకు పాల్పడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, విజ్జగిరి నారాయణ, దాసరి రమేశ్, కోవా రవి, దమ్మపాల్, కొండ గణేశ్, అడప తిరుపతి, అన్నెలా వసంత్, ఉగ్గే విఠల్, మహేశ్, నీలేశ్, రాజు, సాయికుమార్, విక్రమ్ పాల్గొన్నారు.





పార్టీలో చేరిన వారికి గులాబీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

### ఉగాది వేడుకల్లో ఎమ్మెల్యే



వ్యవసాయ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

*శ్రీ విశ్వావసు నామ సంవత్సరాన్ని పురస్కరించుకుని తన స్వగ్రామంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు. గ్రామంలో తన వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులతో కలిసి భూమాతకు పూజలు చేసి కొత్త సంవత్సరంలో వ్యవసాయ పనులు ప్రారంభించారు. అనంతరం భూమాత దేవికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు తెలుగు నూతన సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.*

*- నేరడిగొండ, మార్చి 30*

## ప్రైవేట్ వ్యక్తులకు వాహనాలు ఆపే అధికారం లేదు

### ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఎదులాపురం, మార్చి 30 : ప్రైవేట్ వ్యక్తులకు వాహనాలను ఆపే అధికారం లేదని, అలా చేసిన ఒక ఎంవీఐ అధికారి ప్రైవేట్ డ్రైవర్ యుగందర్‌పై కేసు నమోదు చేశామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనివారం భోరజ్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న ఒక ఎంవీఐ అధికారి ప్రైవేట్ డ్రైవర్ యుగందర్ ప్రైవేటు వ్యక్తి వాహనాలు ఆపి ధ్రువపత్రాలు అడగ్గా హైవే పెట్రోల్ గమనించి జైనథ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు.. చెక్ పోస్టు, టోల్ ప్లాజాల వద్ద ప్రైవేటు వ్యక్తులు, అధికారుల ప్రైవేట్ డ్రైవర్లు వాహనాల ఆపడానికి, తనిఖీలు చేయడానికి అనుమతి లేదని పేర్కొన్నారు. ఇక నుంచి ఏ శాఖ అధికారికి సంబంధించిన ప్రైవేటు వ్యక్తులు అనధికారంగా వాహనాలు ఆపిన, తనిఖీలు చేసిన, సంబంధిత అధికారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారని తెలిపారు.

# మక్క రైతు దిగాలు

● కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని సర్కారు

● దళారులకు అమ్మి నష్టపోతున్న అన్నదాతలు



దిలావర్‌పూర్ రైతుల వద్దకు వచ్చి దళారులు పంపిన వ్యక్తులు సంచులు నింపుతున్న కూలీలు

### దళారులకు అమ్ముకున్న..



*నేను 1.20 ఎకరాల్లో మక్క వేశా. మంచి దిగుబడి వచ్చింది. సర్కారోళ్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు అమ్ముకున్న. నెల తరువాత డబ్బులు ఇస్తామన్నారు. సరే అని అమ్మివచ్చా. అనుకున్న ధర వస్తే బాగుండేది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాలుకు రెండు, మూడు నూర్లు ఎక్కువ వస్తుండే.*

**- పోతన్న, రైతు, న్యూ లోలం.**



గుండంపల్లి పరిసర ప్రాంతంలో విక్రయించేందుకు మక్కలను ఆరబెట్టిన రైతులు

దిలావర్‌పూర్, మార్చి 30 : నిర్మల్ జిల్లాలోని 18 మండలాల్లో 42,597 మంది రైతులు తమ భూముల్లో 87,664 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఇప్పటికే 50 శాతానికి పైగా పంట చేతికొచ్చింది. అత్యధికంగా ముథోల్ నియెజకవర్గం, ఖానాపూర్‌లో అత్యల్పంగా సాగు చేస్తున్నారు. పంటను అమ్ముకునేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు అమ్మి నష్టపోతున్నారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మార్క్‌ఫెడ్, ఇతర సహకార సంఘాల ద్వారా కొనుగోలు చేసింది. ప్రస్తుతం రైతులు ఒక క్వింటాలుకు దాదాపు రూ.200లకు పైగా నష్టపోవడంతోపాటు, వారు చెప్పిన తేదీకే పైసలు ఇస్తామని చెప్పి రైతుల వద్ద నుంచి మక్కలను కొనుగోలు చేస్తున్నారు.

### కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి..



*ఈ యాసంగిలో నాలుగెకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. రెండెకరాల్లో మక్కను కోసి తక్కువ ధరకు అమ్ముకున్నా. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో క్వింటాలుకు రూ.200 వరకు తక్కువకే ఇచ్చివేసిన. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. దళారులకు మక్కలన్నీ అమ్మిన తరువాత ఏర్పాటు చేస్తే ఏం లాభం ఉండదు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే దళారులు కూడా ధర పెంచుతారు. లేకుంటే వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తుంది.*

**- చిన్నరెడ్డి, రైతు.**